ప్రజాశక్తి
గురువారం 20 నవంబర్ 2025
5
విజయనగరం

నిరుద్యోగ యువతకు రుణ అవకాశం

ప్రజాశక్తి - కంటోన్మెంట్

జిల్లాలోని సఫాయి కర్మచారి వృత్తిలో వున్న నిరుద్యోగ యువతకు ఎన్ఎస్‌కెఎఫ్‌డిసి పథకంలో సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాలను సబ్సిడీపై రుణాలు మంజూరు చేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డు కులాల సేవా సహకార సంస్థ కార్యనిర్వాహక సంచాలకులు డి.వెంకటేశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు. సఫాయి కర్మచారి నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 23 వరకు పొడిగించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనుభవం, అర్హతలు గల అభ్యర్థులు నేరుగా విజయనగరంలోని కార్యనిర్వాహక సంచాలకులు, జిల్లా షెడ్యూల్డు కులాల సేవా సహకార సంస్థ, మర్రిచెన్నారెడ్డి భవనంలో స్వయంగా గాని లేదా పోస్ట్ ద్వారా గాని ఈనెల 23లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని పూర్తి వివరాలకు 9030014742, 9642460838, 96526009678 నెంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

దళితులపై కొనసాగుతున్న వివక్ష

కేసుల నమోదు, ఛార్జిషీట్, నష్టపరిహారం చెల్లింపుల్లో తీవ్ర జాప్యం

నేడు జిల్లాకు రానున్న ఎస్‌సి కమిషన్ ఛైర్మన్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో దళితులపై సామాజిక వివక్ష కొనసాగుతోంది. చాలా సందర్భాల్లో కేసులు నమోదు మొదలుకుని, ఛార్జిషీట్లు వేయడం, అట్రాసిటీ కేసుల్లోని బాధితులకు నష్టపరిహారం చెల్లింపు తదితర విషయాల్లో పోలీసుల వద్ద తీవ్ర జాప్యం కూడా జరుగుతోంది. ఇదే విషయాన్ని కమిషన్ ముందుపెట్టేందుకు దళితులు, దళిత సంఘాల నాయకులు చాలా కాలంగా ఎదురు చూస్తున్నారు. ఇందుకు తగ్గట్టే ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. దళితుల సమస్యలపై కమిషన్ స్పందన ఏ విధంగా ఉంటుందో వేచి చూడాల్సిందే.

పలు గ్రామాల్లో అంటరానితనం, కులవివక్ష ఉండడంతో పాటు చాలా కాలం క్రితమే ఆత్మీయ అత్యాచారాలు జరిగిన జిల్లాగా విజయనగరాన్ని గుర్తించిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ వీటిని రూపుమాపడంలో అధికార యంత్రాంగం విఫలమౌతునే ఉంది. జిల్లాలో చాలా మంది రైతులు భూ సమస్య ఎదుర్కొంటున్నారు. గతంలో వైఎస్‌ఆర్ ప్రభుత్వం తరువాత అసైన్‌మెంట్ భూములు ఇవ్వలేదు. 20ఏళ్ల క్రితం ఇచ్చిన భూములను గత ప్రభుత్వం రిగ్యులరైజేషన్ చేస్తామని పేరుతో విక్రయించుకున్నవారి భూములను మాత్రమే ఫ్రీహోల్డ్ చేసింది. ఆమేరకు దళితులు భూములను కోల్పోయారు. ఈ ఏడాది మెంటాడ మండలం పెదమేడపల్లిలో భూ వివాదం కారణంగా ఓ దళితుడి హత్య జరిగింది. కేసు నమోదు చేసినప్పటికీ ప్రస్తుతం అది నీరుగారుతోందని కులవివక్ష వ్యతిరేక పోరాటం సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డి-పట్టాలు రద్దుచేయడంలో మెంటాడకు చెందిన 60మంది, జక్కువలో 30మంది దళిత కుటుంబాల వారికి అన్నదాత సుఖీభవ పథకం వర్తించలేదు. దీనిపై అధికారులు అసైన్మెంట్ కమిటీ ఆమోదం లేదనే సాకు చెబుతున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే జిల్లాలో ఎన్నో సమస్యలు దళితులను వెంటాడుతున్నాయి. డప్పుకళాకారులు డప్పులు, గజ్జల కోసం దశాబ్దాల తరబడి ఎదురు చూస్తున్నారు. పింఛన్లు కూడా మంజూరు చేయడం లేదు. చాలా వరకు ఎస్‌సి కాలనీల్లో సబ్-ప్లాన్ నిధులు ఉపయోగించడం లేదు.

బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే స్వగ్రామం పిరిడిలో నేటికీ రెండు గ్లాసుల పద్ధతి కొనసాగుతోందని దళిత సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బొండపల్లి మండలం బి.రాజేరులో శ్మశాన వాటికకు దారిలేకుండా ఆటంక పరుస్తున్నారంటూ స్థానిక దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల్లిమర్ల మండలం సతివాడలో దళితవాడలో ఈ ఏడాది ప్రతిష్టించిన వినాయక విగ్రహాన్ని ఊరేగించేందుకు పెత్తందారులు నిరాకరించారు. దీంతో, దళితులు ఇతర సామాజిక వర్గాలకు మధ్య వాగ్వివాదం, పెనుగులాట చోటు చేసుకుంది. చివరకు దళితులకు తెలియకుండానే వారి విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు నిమజ్జనం చేసేశారు. ఈ విషయంలో కేసు నమోదు చేయడం మొదలుకుని, విచారణ చేపట్టడం వరకు పోలీసులు తీవ్ర జాప్యం ప్రదర్శించారని బాధితులు, దళిత సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. ఎవరు నిమజ్జనం చేశారన్నది ఇప్పటికీ పోలీసులు తేల్చలేదని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరిగినా స్థానిక ఆర్‌డిఒ ఆ గ్రామాన్ని సందర్శించకపోవడం గమనార్హం. ఇదే మండలం మల్యాడలో గతంలో చెరువు వద్ద అంటరానితనం బయట పడింది. గడిచిన మూడు నెలల్లో 20 అట్రాసిటీ కేసులు నమోదు కాగా, ఇప్పటికీ 19కేసులు విచారణ దశలోనే ఉన్నట్టుగా సమాచారం. కుల ధ్రువీకరణ పత్రాలు, మెడికల్ సర్టిఫికెట్లు ఇవేవీ సకాలంలో అందక ఆలస్యం జరుగుతోందని దళితులు ఆరోపిస్తున్నారు. అట్రాసిటీ కేసుల నమోదు సమయంలో బాధితులకు ఏడు రోజుల్లో నష్టపరిహారం అందించాల్సివున్నప్పటికీ జాప్యం జరుగుతోందని దళిత సంఘాల వాదన. పోలీసుల విచారణ, లేదా కోర్టులకు హాజరు వంటి సందర్భాల్లో బాధితులతోపాటు వారి తరపున వచ్చేవారికి టిఎ, డిఎ నిబంధన కూడా ఉందని, దాన్ని కూడా చెల్లించడం లేదని చెబుతున్నారు.

ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ పర్యటన ఇలా..

కంటోన్మెంట్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్ కులాల కమిషన్ ఛైర్మన్ కె.ఎస్.జవహర్ ఆధ్వర్యంలో కమిటీ ఈనెల 20న జిల్లాలో పర్యటించనున్నదని కలెక్టర్ ఎస్ రామసుందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 1గంట వరకు జిల్లా పరిషత్ గెస్ట్ హౌస్‌లో షెడ్యూల్ కుల సంఘాల ప్రతినిధుల నుంచి వినతులు స్వీకరిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 2గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు జిల్లా అధికారులతో కలెక్టరేట్ మీటింగు హాల్లో సమీక్షా సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. సాయంత్రం 5 గంటల నుండి 6 వరకు జిల్లా పరిషత్ గెస్ట్ హౌస్‌లో ఎస్‌సి నాయకులను కలిసి వినతులు స్వీకరిస్తారని తెలిపారు.



వేపాడ మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి; గజపతినగరంలో రైతులకు చెక్కును అందజేస్తున్న నాగార్జున తదితరులు

అధిక లాభాలు వచ్చే పంటలపై మొగ్గు చూపాలి

కలెక్టర్ రామసుందర్ రెడ్డి

2.27 లక్షల మంది రైతులకు 'సుఖీభవ' నిధులు విడుదల

ప్రజాశక్తి-వేపాడ

రైతులు అధిక లాభాలు వచ్చే పంటల సాగు వైపు మొగ్గు చూపాలని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి సూచించారు. అధికవర్షాలు నమోదు కావడం వలన జిల్లా వ్యాప్తంగా వరి పంట అధిక దిగుబడి సాధించామని అన్నారు. వేపాడ తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్ రెండో విడత నిధులు విడుదల కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి పాల్గొని అన్నదాత సుఖీభవ -పిఎం కిసాన్ పథకం కింద జిల్లా లో 2.27 లక్షల మంది రైతులకు రూ.150 కోట్లు నిధులు విడుదల చేసారు. అంతకు ముందు ప్రధాని, ముఖ్యమంత్రి ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమమే ముఖ్యమంత్రి ధ్యేయమని, రైతులకు ఆర్థిక లబ్ధి చేకూరేందుకు అన్నదాత సుఖీభవ పథకం ప్రవేశపెట్టారని తెలిపారు. వరిపంటకు ఎంత యూరియా అవసరమో అంతే వాడాలని సూచించారు. సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం, బిందుసేద్యం రైతుకు లాభదాయకమని అన్నారు. వరితో పాటు అధిక లాభాలు ఇచ్చే ఇతర పంటల సాగు పై దృష్టి పెట్టాలని తద్వారా ప్రతి రైతు ఉన్నత స్థితికి చేరుకోగలరని ఆశాభావం వ్యక్తం చేసారు. అనంతరం ధాన్యం సేకరణ కేంద్రాన్ని ఎంఎల్‌ఎ కోళ్ల లలిత కుమారితో కలిసి ప్రారంభించారు. జిల్లాలో నాలుగు లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం పెట్టుకున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే లలితకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్ పథకం రైతుకు బాసటగా నిలుస్తుందని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల గడువుకు ముందే రైతు ఖాతా లో నగదుజమ చేస్తున్న ఘనత ఈ ప్రభుత్వానిది అని అన్నారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణ, వేపాడ పిఎసిఎస్ ఛైర్మన్ జిఎస్ నాయుడు, దాసరి కమ్యూనిటీ వెల్ఫేర్ ఛైర్మన్ రత్నాజి, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రైతుల అవసరాలు తీర్చడమే ప్రభుత్వ లక్ష్యం

డిసిసిబి ఛైర్మన్ నాగార్జున

గజపతినగరం : రైతులను అవసరాలు తీర్చడమే ప్రభుత్వ లక్ష్యమని డిసిసిబి ఛైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. మండల కేంద్రంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద కన్వెన్షన్ హాల్లో 'అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్'నిధులు విడుదల కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డిసిసిబి ఛైర్మన్ కిమిడి నాగార్జున హాజరయ్యారు.తొలుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిధులు విడుదల కార్యక్రమాన్ని తిలకించారు. అనంతరం డిసిసిబి ఛైర్మన్ నాగార్జున మాట్లాడుతూ.... కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం దశలవారీగా వ్యవసాయానికి చేయూతనిస్తూ అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ నిధులను రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తుందని అన్నారు. వ్యవసాయానికి ప్రోత్సాహంగా యంత్రాలను సబ్సిడీపై అందిస్తున్నామని అన్నారు. గజపతినగరం నియోజకవర్గంలో 45,075 మంది రైతు కుటుంబాలకు రూ.29.45 కోట్ల సొమ్మును నేరుగా వారి ఖాతాలో జమ చేస్తున్నామని వెల్లడించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో వరిచేలు కోత దశలో ఉండటంతో పెట్టుబడి సహాయంగా ప్రతి రైతుకు రెండవ విడతగా రూ.7వేలు సహాయాన్ని అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ పివివి గోపాలరాజు, గంట్యాడ మాజీ ఎంపిపి కొండపల్లి కొండలరావు, గంట్యాడ, గజపతినగరం మండల పార్టీ అధ్యక్షులు కొండపల్లి భాస్కర్ నాయుడు, గంట్యాడ శ్రీదేవి, టిడిపి నాయకులు వివి ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోమేటిక్ టెస్టింగ్ యంత్రం ఏర్పాటు : కలెక్టర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

నగరంలో వాహన కాలుష్యం కొలిచేందుకు ఆటోమేటిక్ టెస్టింగ్ మెషీన్లను ఏర్పాటు చేయాలని రవాణా అధికారులకు కలెక్టర్ రామసుందర్‌రెడ్డి సూచించారు. తన ఛాంబర్ లో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. పట్టణ ప్రాంతాల్లో రహదారులు ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన రూ.2.8 కోట్లు నిధులతో పెండింగ్ లో ఉన్న పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వజన ఆసుపత్రి నుండి రైతుబజార్ వరకు ఉన్న రహదారి విస్తరణ పనులకు రూ1.5కోట్లు నిధులు కమిటీ ఆమోదించింది. సమావేశంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను తనిఖీ చేసిన డ్వామా పీడీ

ప్రజాశక్తి-దత్తిరాజేరు

ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న డ్వామా పీడీ

గ్రామీణ ఉపాధి హామీ కింద మండలంలోని గుచ్చిమి గ్రామంలో జరుగుతున్న ఫారం పాండ్ పనులను బుధవారం డ్వామా పీడీ శారదాదేవి తనిఖీ చేశారు వేతనదారులకు ఎంత వేతనం వస్తుందని ఫీల్డ్ అసిస్టెంట్‌ను అడిగి తెలుసుకున్నారు కలెక్టర్ ఆదేశాల మేరకు మండలానికి వెయ్యి మంది వేతన దారులతో పనిచేపించాలని ఎపిఒకు సూచించారు. గ్రామానికి 40 నుంచి 50 మంది వేతన దారులతో ఖచ్చితంగా పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు ప్రతి గ్రామంలో ఫారం పాండ్లు, కంపోస్ట్ ఫీట్లు, భూమి అభివృద్ధి పనులు కచ్చితంగా జరిగేలా చూసుకోవాలని తెలిపారు. రోజువారీ వేతనం రూ. 307 వచ్చే విధంగా మార్కింగ్ ఇచ్చి పనులు చేపించాలని సూచించారు కార్యక్రమంలో ఎపిఒ, సాంకేతిక సహాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు

ఉపాధ్యాయుడిపై దాడికి యత్నం

క్రమశిక్షణగా చదువుకోవాలని చెప్పడమే నేరం

ప్రజాశక్తి-రామభద్రపురం

బాల్య దశలో క్రమశిక్షణతో చదవాలని నిత్యం మందలించారనే కోపంతో గురువుపైనే ఓ బాలుడు దాడి చేయడానికి యత్నించిన ఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ ప్రసాదరావు కథనం ప్రకారం.. చందాపురం గ్రామానికి చెందిన యాల దిలీప్ ఆ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో గతంలో చదువుకున్నప్పుడు ఆ పాఠశాల ఉపాధ్యాయుడు సువ్వాడ వెంకటప్పలనాయుడు మందలించారు. దీంతో కక్ష పెట్టుకున్న ఆ బాలుడు ఉపాధ్యాయుడిపై ఆరు నెలల కిందట కత్తితో దాడిచేయడానికి యత్నించాడు. దీంతో అప్పట్లో బాలుడిని పోలీసు స్టేషన్ కు పిలిపించి పోలీసులు మందలించి పంపేశారు. తాజాగా పాఠశాల విధులు ముగించుకొని వస్తున్న ఉపాధ్యాయుడిని అడ్డగించి దాడి చేయడానికి యత్నించడంతో అక్కడ ఉన్న కొంతమంది గిరిజనులు బాలుడిని అడ్డుకొని ఉపాధ్యాయుడిని సురక్షితంగా పంపించారు. దీనిపై ఉపాధ్యాయుడు మరలా పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేసారు. అయితే విద్యార్థి మైనర్ కావడంతో చర్యలు తీసుకోవడానికి పోలీసులు తర్జన బర్జన పడుతున్నారు. ఎస్ఐ ప్రసాదరావు చందాపురం గ్రామానికి వెళ్లి ఆ బాలుడితో మాట్లాడి తల్లిదండ్రులకు కూడా కౌన్సిలింగ్ ఇచ్చారు. బాలుడు మానసిక వ్యాధితో బాధపడుతున్నట్టు తల్లిదండ్రులు తెలపడంతో బాలుడిని ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించాలని ఎస్ఐ సూచించారు. మళ్లీ ఇటువంటి సంఘటనలు పునరావృతం అయితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

సమస్యల పరిష్కారానికి 24న పోరాట దీక్ష

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎపిసికి వినతిస్తున్న యూనియన్ నాయకులు

సమగ్రశిక్ష లో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న కలెక్టరేట్ వద్ద పోరాట దీక్ష చేస్తున్నట్లు ఎపి సమగ్రశిక్ష కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కాంతారావు తెలిపారు. ఈమేరకు ఎపిసి రామారావుకు బుధవారం వినతి అందజేశారు. అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే డిసెంబర్ 10న చలో విజయవాడ ఎస్‌పిడి ఆఫీసు కార్యరకమం చేపడతామని తెలిపారు. దీర్ఘకాలంగా సమగ్రశిక్ష లో పని చేస్తున్న ఉద్యోగులు పరిస్థితి అధ్వానంగా ఉందని తెలిపారు. గత ప్రభుత్వం ఎంటిఎస్ ఇస్తామని హామీ ఇచ్చి కాలయాపన చేసిందని అన్నారు. తక్షణమే సమగ్రశిక్ష ఉద్యోగులకు, కెజిబివి ఉద్యోగులకు ఎంటిఎస్, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పోరాటంలో భాగంగా ఈ నెల 24న రాష్ట్రంలో అన్ని జిల్లాల కలెక్టరేట్‌ల వద్ద ధర్నాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర జెఎసి సభ్యులు ఆరికతోట రామకృష్ణ, జిల్లా నాయకులు జి.శ్రీనివాసరావు, కె.రమేషకుమార్, డి.నరసింహులు, కె.రాంబాబు పాల్గొన్నారు

నేడు 'జయంతి' స్మారక పురస్కారం ప్రదానం

ప్రజాశక్తి-విజయనగరంకోట

గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు ముగింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి బి.లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ గ్రంథాలయ ఉద్యోగి గ్రంథాలయ ఉద్యమ నేత జయంతి రామలక్షణమూర్తి స్మారక పురస్కారం ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నవంబరు 14 నుంచి 18వరకు నిర్వహించిన బాలల సమ్మేళనం, వ్యాసరచన, క్విజ్, లలిత సంగీతం, చిత్రలేఖనంలో పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. గ్రంథాలయాల విశిష్టతకు, వాటి అవశ్యకతకు అద్దం పట్టే గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జిల్లా గ్రంథాలయ సేవా సంఘం సభ్యులు పాల్గొంటారని తెలిపారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా స్థాయిలో జరిగిన యోగా ఎంపిక లో విజయనగరం మండలం గుంకలాం జెడ్‌పి హైస్కూలు ఆరో తరగతి విద్యార్థి చింత రేవంత్ కుమార్ అండర్ 14 విభాగంలో ఎంపికయ్యాడు. బాపట్లలో జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్ 14, అండర్ 17 స్కూల్ గేమ్స్‌లో పాల్గొననున్నాడు ఈ సందర్భంగా రేవంత్‌కుమార్‌ను పాధ్యాయులు వెలమల శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

జాతీయ తైక్వాండో పోటీలకు జిల్లా క్రీడాకారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జాతీయస్థాయి తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలకు జిల్లాకు చెందిన ఏడుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు గురాన అయ్యలు, రాష్ట్ర కార్యదర్శి సి హెచ్ వేణుగోపాల్ రావు తెలిపారు. ఈనెల 21 నుంచి 23 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బరేలిలో సీనియర్ , క్యాడిట్ జాతీయ స్థాయి పోటీలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ పోటీలకు విజయనగరం జిల్లా నుండి రాష్ట్రం తరపున ఏడుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు తెలిపారు. అనంతపురం జిల్లాలో ఇటీవల రాష్ట్రస్థాయి జరిగిన పోటీల్లో జిల్లాకు చెందిన ఈ క్రీడాకారులు గోల్డ్ మెడల్స్ సాధించారన్నారు. గోల్డ్ మెడల్స్ సాధించిన క్రీడాకారులను జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు గురాన అయ్యలు , రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి సిహెచ్ వేణుగోపాల్ రావు , జనసేన నాయకుడు ఆదాడ మోహన్‌రావు, కోచ్ లు యశస్విని, చైతన్య అభినందించారు.

బిపిఎస్ దరఖాస్తులు త్వరితగతిన పూర్తి : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బిపిఎస్, ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు త్వరితగతిన పూర్తి చేయాలని టౌన్ ప్లానింగ్ సిబ్బందికి నగర పాలక కమిషనర్ నల్లనయ్య ఆదేశించారు. బుధవారం తమ కార్యాలయంలో ప్రణాళిక కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. అక్రమ నిర్మాణాలను, అనుమతి లేని కట్టడాలను ఎట్టి పరిస్థితులోను ఉపేక్షించవద్దని చెప్పారు. నిర్మాణ పనులు ప్రారంభ దశలోని అడ్డుకొని తొలగించాలని చెప్పారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, టిపిఒ అప్పలరాజు, టిపిఎస్ అనిత పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

విధులు పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కమిషనర్ నల్లనయ్య అన్నారు. నగరంలోని 1,2,4 నెంబరు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా హాజరు పట్టిని, రికార్డులను పరిశీలించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వారిని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

క్రికెట్ క్రీడాకారుడికి అభినందన

ప్రజాశక్తి- కంటోన్మెంట్

విశాఖలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్14 క్రికెట్ పోటీల్లో సత్తా చాటిన విజయనగరం జిల్లాకు చెందిన పైల విగ్నేష్‌ను జెడ్‌పి ఛైర్మన్ మజ్జిశ్రీనివాసరావు అభినందించారు. తెర్లాం మండలం బూర్జవలస గ్రామ సర్పంచ్ గణపతి కుమారుడైన పైల విగ్నేష్ ఉత్తమ ప్రతిభను కనబరిచి , నార్త్ జోన్ వైస్ కెప్టెన్ గా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా విగ్నేష్ బుధవారం శ్రీనివాసరావు (చిన్న శ్రీను)ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా క్రీడల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచినందుకు విగ్నేష్ ను అభినందిస్తూ, రానున్న రోజుల్లో మరింతగా రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని , క్రీడాకారులకు తగిన విధంగా ప్రోత్సాహాన్ని అందిస్తానని తెలిపారు.

నివాసం ఉన్నచోటే పట్టాలివ్వాలి

- 24న చలో కలెక్టరేట్
- సిపిఎం నగర కార్యదర్శి శంకరరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

పట్టణాల్లో నివాసం ఉంటున్న పేదలకు వారు నివాసం ఉన్న చోటే ఇళ్ల పట్టాలిచ్చి ఇంటి నిర్మాణానికి రుణం మంజూరు చేయాలని కోరుతూ ఈనెల 24న చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు తెలిపారు. బుధవారం స్థానిక ఎల్‌బిజి భవనం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చలో కలెక్టరేట్ గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇళ్లు కడతామని రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 30 విడుదల చేసి ఏడాది అయ్యిందన్నారు. అయినా నగరంలో ఏ ఒక్కరికీ ఈ జీవో అమలు చేసి పట్టాలు ఇవ్వలేదన్నారు. రామకృష్ణానగర్, ఎల్‌బిజినగర్, గురజాడనగర్, వినాయకనగర్, జొన్నగుడ్డి, బుంగవీధి, పూల్‌బాగ్ పిజి కాలేజీ ఎదురుగా, గంజిపేట, గొడగల వీధి, స్టేడియంపేట, నల్లచెరువు, దాసన్న పేట ఎర్రచెరువులో పేదలు దశాబ్దాలుగా నివాసం ఉంటున్నారని తెలిపారు. కానీ నేటికీ వారికి పట్టాలు ఇవ్వలేదన్నారు. తక్షణమే పట్టాలిచ్చి ఇళ్లు కట్టి ఇవ్వాలని కోరారు. ఇళ్లు లేని పేదలకు 2 సెంట్లు భూమి కేటాయించి నిర్మాణానికి రూ.5లక్షలు ఇస్తామని, అధికారంలోకి రాగానే టిడ్కో ఇళ్లు అప్పగిస్తామని, హామీ ఇచ్చిన కూటమి నేతలు నేటికీ ఆ ప్రక్రియ ప్రారంభించ లేదన్నారు. పట్టణ పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇచ్చి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తలపెట్టిన కలెక్టరేట్ వద్ద ధర్నాలో పేదలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ, వి.రామచంద్రరావు, వి.లక్ష్మి పాల్గొన్నారు.

ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులు, సిపిఎం నాయకులు

గిరిజనులకు అన్యాయం చేస్తే సహించేది లేదు

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని ● ఆర్‌డిఒ కార్యాలయం వద్ద గిరిజనుల ధర్నా

ప్రజాశక్తి -బొబ్బిలి

గిరిజనులకు అన్యాయం చేస్తే సహించేది లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. గిరిజనులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ రామభద్రపురం మండలం మిర్తివలస పంచాయతీ కాకర్లవలస, పుల్లేరుగుడ్డివలస, జాకరాపువలస, కారేడువలస గ్రామాల గిరిజనులు సాగు చేస్తున్న భూములను గ్రామసభ తీర్మానం లేకుండా ఎంఎస్ఎంఇ పార్కుకు అప్పగించడం అన్యాయమన్నారు. రాళ్లు, రప్పలతో ఉన్న భూములను చదును చేసి 25ఏళ్ల నుంచి జీవనోపాధి పొందితే నేడు గిరిజనుల అనుమతి లేకుండా ఎంఎస్ఎంఇ పార్కుకు కేటాయించడం అన్యాయమన్నారు. భూములను లాక్కోవడంతో గిరిజనులు జీవనోపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల పేరుతో గిరిజనుల భూములను లక్కోవడం సరికాదన్నారు. పరిశ్రమలు కోసం గ్రోత్ సెంటర్లో 1150 ఎకరాలు భూమి సేకరించినప్పటికీ నేటికీ పూర్తి స్థాయిలో పరిశ్రమలు పెట్టలేదని అన్నారు. పరిశ్రమల భూములతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు న్యాయం చేయకపోతే పోరాటం ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఎం రామభద్రపురం మండల కార్యదర్శి బలస శ్రీను, గిరిజనులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక విజ్జి మైదానంలో బుధవార డిఎస్‌రాజు మెమోరియల్ అండర్ 19 క్రికెట్ టోర్నమెంట్‌ను రాష్ట్ర చిన్న మధ్య తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మితో కలిసి ప్రారంభించారు. అనంతరం మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రికెట్ ప్రపంచ స్థాయిలో ఆదరణ కలిగిన క్రీడా అన్నారు. బాగా ఆడటం, మెరుగైన ప్రదర్శన చేయడం ద్వారా మంచి భవిష్యత్ ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందన్నారు.గెలుపు ఓటమలు సహజమని వాటిని క్రీడా స్ఫూర్తితో తీసుకోవాలన్నారు. ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ విజ్జి స్టేడియం ప్రధాన రూపకర్త పూసపాటి అశోక్ గజపతి రాజు ఆశయాలకు, ఆలోచనలకు అనుగుణంగా విజయనగరం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ముందుకు వెళుతుందని అన్నారు. పేద కుటుంబం నుండి వచ్చినా అవకాశాలు అందితే వారు కూడా జాతీయ స్థాయి క్రీడాకారులుగా గుర్తింపు పొందుతారనే ఉద్దేశంతో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ 19 క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారని తెలిపారు. క్రీడాకారులందరూ ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విజ్జి స్టేడియం అభివృద్ధికి తన ఎంపీ లాడ్స్ నుంచి పది లక్షల రూపాయలను కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం ఎంపీ టాస్ వేయగా, మంత్రి బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు డిఎస్ రాజు మెమోరియల్ క్లబ్ సభ్యులు క్రికెట్ అసోసియేషన్‌కార్యదర్శి రాంబాబు, అసోసియేషన్ ప్రతినిధులు, 12 జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రికెట్ ఆడుతూ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్

గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలి

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని ప్రతి గ్రామాన్నీ చెత్తా చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని ఎంపిపి పీరుబండి హైమావతి అన్నారు. బుధవారం మండల కార్యాలయంలో జరిగిన సుస్థిర అభివృద్ధిపై శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలోని చెత్తాచెదారాన్ని బయటకు తరలించడానికి అవసరమైన పనిముట్లను భద్రపరిచి ఉంచుకోవాలన్నారు. ఇంటిని పరిశుభ్రంగా చేసుకున్నప్పుడే గ్రామం పరిశుభ్రంగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఆర్‌వి రమణమూర్తి, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు పీరుబండి జైహిందకుమార్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వంగర: గ్రామాభివృద్ధిలో సర్పంచులదే కీలక పాత్ర అని ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ టి.రాజారావు అధ్యక్షతన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలందరూ కూడా మరుగుదొడ్లు వాడుకునే విధంగా అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కరణం సుదర్శనరావు, వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డెంకాడ: గ్రామాల అభివృద్ధి పథంలో నడవాలంటే ముందుగా పచ్చదనం పరిశుభ్రతగా ఉండాలని ఎంపిడిఒ వై. భవానీ అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం సర్పంచులు, కార్యదర్శులకు పచ్చదనంపై ఒక రోజు శిక్షణ ఇచ్చారు. అనంతరం కార్యదర్శులు టి.వెంకట్రావు, సిహెచ్ అప్పలనాయుడు సర్పంచులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

చీపురుపల్లి: స్వచ్ఛమైన పర్యావరణాన్ని ముందు తరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపిడిఒ ఇప్పలవలస సురేష్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో పరిశుభ్రత పచ్చదనంపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో వై.సింహాచలం, కార్యదర్శులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ రామకృష్ణరాజు

మెరకముడిదాం: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం ఇంఛార్జి ఎంపిడిఒ బివి.సుదర్శన్ పట్నాయక్, మండలంలో ఉన్న సర్పంచులు, ఉపసర్పంచులు గ్రామ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎపిఎం రాజశేఖర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శృంగవరపుకోట: మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచులకు, ఉపసర్పంచులకు థీమ్ 5 పరిశుభ్రత – పచ్చదనంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ధర్మవరం పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ పలు అంశాలపై శిక్షణిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతపై మరింత అవగాహన కల్పించాలని ఎంపిడిఒ కె.రామకృష్ణరాజు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మూడు రోజుల పాటు జరుగుతున్న పచ్చదనం, పరిశుభ్రత శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే పచ్చదనం, పరిశుభ్రత పై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వేపాడ: మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం పచ్చదనం పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఎంపిపి డి. సత్యవంతుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే గ్రామం పరిశుభ్రంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సేనాపతి అప్పారావు, ఇఒపిఆర్‌డి రవికుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ దేవి, మండల స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ జి.రాంబాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రామభద్రపురం: గ్రామ పంచాయతీల్లో అపారిశుధ్యం నిర్మూళనకు చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ రత్నం కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామ కార్యదర్శులకు ఒక్కరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిసోర్సు పర్సన్ తమ్మిరెడ్డి వెంకటరమణ, టిఒటి రామరాజు, మండల పరిషత్ ఎఒ సన్యాసిరావు, సీనియర్ అసిస్టెంట్ చొక్కావు శ్రీరాములునాయుడు తదితరులు పాల్గొన్నారు.

జామి: ఎంపిడిఒ అప్పలనాయుడు ఆధ్వర్యంలో మండల పరిషత్ సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జెడ్‌పిటిసి గొర్లె సరయు హాజరై పలు సూచనలు చేశారు. శిక్షకులుగా ఎన్. ఖాన్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

డెంకాడ: మండలంలోని చొల్లంగిపేటలో బుధవారం ఎమ్మెల్యే లోకం నాగమాధవి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతూ తాను పండించిన ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రంలో మాత్రమే అమ్మి మద్దతు ధరను పొందాలన్నారు. వరి ఒక క్వింటాకు ప్రభుత్వం మద్దతు ధర రూ.2369 ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ఏ నాగభూషణ రావు, తహశీల్దార్ ఎం. రాజారావు, ఎఒ సంగీత, వ్యవసాయ విస్తరణ అధికారులు బి రామకోటి, ప్రశాంతి, సర్పంచ్ కనకరాజు, సూర్యప్రకాష్, సురేష్‌రాజు, వ్యవసాయ సిబ్బంది, పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

భోగాపురం: సిఎం సహాయనిధి చెక్కులను టిడిపి ఇంఛార్జి, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు బుధవారం అందజేశారు. పోలిపల్లిలో తన స్వగృహం వద్ద నెల్లిమర్ల మండలం కొత్తపేట గ్రామానికి చెందిన గొర్లె శోభకు రూ.90,266, భోగాపురం మండలం చేపలకంచేరు గ్రామానికి చెందిన అరజల్ల సాత్విక్‌కు రూ.60వేలు చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో నెల్లిమర్ల టిడిపి మండల ప్రధాన కార్యదర్శి గురజ చక్రి, నీలావు అప్పలరామి రెడ్డి, కూరాడ తాతారావు, మైలపల్లి ఎల్లాజి తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా 265 బియ్యం కార్డులు

గంట్యాడ: కొత్తగా మరో 265 మందికి బియ్యం కార్డులు మంజూరయ్యాయని సిఎస్‌డిటి మూర్తి అన్నారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం డీలర్లకు పేపర్ రోలింగ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్డు దారునికీ రోలింగ్ పేపర్‌ను అందజేసి సరుకును అందజేయాలన్నారు. పేపర్‌ను అందజేసిన తరువాత బియ్యం అందజేయడానికి ఆలస్యం చేయకూడదన్నారు. గతంలో కొత్త కార్డుల కోసం తహశీల్దార్‌కి దరఖాస్తు చేసుకున్న వారికి కొత్త కార్డులు వచ్చాయని వీటికి డిసెంబర్ ఒకటో తేదీ నుండి బియ్యం పంపిణీ చేస్తామన్నారు.

ప్రతీ రైతు మద్దతు ధర పొందాలి

మెంటాడ: రైతులు పండించే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు పంపించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని టిడిపి మండల అధ్యక్షుడు చలుమూరి వెంకటరావు అన్నారు. మండలంలోని జక్కువ, మెంటాడ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళారుల చేతిలో రైతులు మోసపోకుండా కొనుగోలు కేంద్రాలకు పంపించి అధిక లాభాలను పొందాలన్నారు. మండలంలో 13 రైతు సేవా కేంద్రాలు, 40 వేల ఎకరాల వరి పంటతోపాటు ఇతర పంటలకు ఈ క్రాప్ చేశామని ఎఒ గోపాలకృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ గొర్లె ముసలినాయుడు, తహశీల్దార్ అరుణ కుమారి, సిఇఒలు వెంపడాపు ప్రసాదరావు,శివ, సిఎస్‌డిటి సత్యనారాయణ రైతులు తదితరులు పాల్గొన్నారు.

బినామీల సొమ్మును నొక్కేశారు

శృంగవరపుకోట: బినామీల సొమ్మును రెవెన్యూ సిబ్బంది, జిందాల్ ప్రతినిధి నొక్కేసారని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ ఆరోపించారు. బుధవారం బొడ్డవర వద్ద జిందాల్ బాధితుల చేస్తున్న నిరసన శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. జిందాల్ వ్యవహారంలో జరిగిన మొత్తం అవకతవకలపై సిబిఐ ప్రత్యేకమైన దర్యాప్తు చేయాలన్నారు. కంపెనీ కోసం సేకరించిన భూముల్లో ప్రైవేట్ లేఅవుట్లను చూస్తుంటే జిందాల్ భూసేకరణలో జరిగిన అవకత తవకలు అర్థమవుతున్నాయని, బినామీదారుల పేరుతో జరుగుతున్న హడావిడి చూస్తే త్వరలోనే బినామీదారులందరూ అప్రోవల్‌గా మారి అప్పుడు జరిగిన వాస్తవాలను బయటకు చెబితే జిందాల్ రెవెన్యూ లీలలు బహిర్గతమవుతాయని అన్నారు. అనంతరం మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు.

సిఐటియు మహాసభ కరపత్రం ఆవిష్కరణ

బొబ్బిలి : స్వాతంత్ర ఉద్యమం వారసత్వంలో ఐక్యత పోరాటం నినాదంతో 1970లో పుట్టిన సిఐటియు 1974 చారిత్రాత్మక రైల్వే పోరాటం నుంచి నేడు కొనసాగుతున్న విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటం వరకు అన్ని పోరాటాల్లోనూ అగ్ర భాగాన నిలిచిందని కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జెసి రాజు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శంకర్రావు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి గోపాలు అన్నారు. సిఐటియు 18వ మహాసభలు విశాఖపట్నంలో జరగనున్నాయని వీటిని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు.

గ్రీన్ అంబాసిడర్ల సమస్యలు పరిష్కరించాలి

కొత్తవలస: వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాడి అప్పారావు ఆధ్వర్యంలో గ్రీన్ అంబాసిడరలకు గౌరవ వేతనం రూ.10వేలకు పెంచాలని వారికి పాత బకాయిలను వెంటనే చెల్లించాలని వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఎంపిడిఒ రమణయ్యకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా గాడి అప్పారావు మాట్లాడుతూ గ్రామాలలో ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ చేస్తున్న పారిశుధ్య, వాటర్ సప్లయ్, విద్యుత్తు వీధిలైట్ల నిర్వాహక కార్మికులకు గౌరవ వేతనం రూ.10వేలు ఇవ్వాలని, బకాయిలను తక్షణమే చెల్లించి వారి సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం చేయాలని గతంలో హైకోర్టు ప్రభుత్వానికి ఆదేశించిందని గుర్తు చేశారు. జీవో నెంబర్ 680పై పాలకులు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని వారి న్యాయపరమైన కోర్కెలు తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు పాల్గొన్నారు.

సొంత నిధులతో రోడ్డు నిర్మాణం

డెంకాడ: మండలంలోని పెద్ద తాడివాడ గ్రామంలో కరుమజ్జి బంగారు నాయుడు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు కరుమజ్జి అప్పయ్యమ్మ, అప్పలనాయుడు, త్రినాధ్‌రావు, నాగరాజు, సాయి తేజ తమ సొంత నిధులతో గ్రామంలోని అయ్యప్పస్వామి పీఠం వరకు రోడ్డు నిర్మాణం చేపట్టారు ఈ రోడ్డును స్థలదాత దంతులూరి తిరుపతిరాజు, శ్రీను పంతులు గురుస్వామి బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మంచి ఫలితాలు తీసుకు రావాలి

నెల్లిమర్ల: విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తేవాలని ఆర్‌ఐఒ తవిటినాయుడు అన్నారు. బుధవారం స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే బిసి బాలికల గురుకుల పాఠశాలలో కార్తీక వనభోజనాల సందర్భంగా విద్యార్థులు సందడి చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఐఒ తవిటి నాయుడు మాట్లాడుతూ మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో విద్యనభ్యసించిన ప్రతి విద్యార్థి అకుంఠిత దీక్షతో చదువుకుని పాఠశాలకు మంచి పేరు తేవాలన్నారు. కన్వీనర్, ప్రిన్సిపాల్ బిబి రావు మాట్లాడుతూ టెన్త్, ఇంటర్ ఫలితాల్లో ఎంజెపి గురుకుల పాఠశాల విద్యార్థులు హవా చాటుతున్నారని చెప్పారు.ఇక్కడ నిర్వహిస్తున్న ఐఐటీ, నీట్ శిక్షణను ఇంటర్ విద్యార్థునులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి స్థలాన్ని వినియోగంలోకి తేవాలి

వేపాడ: మండల కేంద్రంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్‌కు కేటాయించిన స్థలం నిరుపయోగంగా ఉండడంతో పరిసర గృహస్తులు బహిర్భూమిగా వినియోగిస్తున్నారని ఈ స్థలాన్ని శుభ్రం చేసి నైట్ హాల్ట్ బస్సులు నిలిపేందుకు చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు ఆర్‌టిసి రీజనల్ చైర్మన్ దొరను కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ ఆ స్థలంలో ఒక విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన చైర్మన్ దొర తప్పనిసరిగా ఆర్‌టిసి యాజమాన్యంతో మాట్లాడే సిబ్బందిని పంపించి స్థలాన్ని బాగు చేయించి బస్సు సౌకర్యం కూడా తొందరలోనే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

దేశభక్తిని చాటుకోవాలి

ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావు

చీపురుపల్లి: మై భారత్ ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్‌పటేల్ 150 యూనిటీ మార్చ్ జిల్లా యంత్రాంగం, పోలీస్, ఎన్.ఎస్.ఎస్, పలు కళాశాలల యువత తో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నుంచి మండల ప్రజా పరిషత్ కార్యాలయం వరకు చేపట్టారు ఈ పాదయాత్రను టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు ప్రారంభించారు. దీనికి ముందు యువతతో జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ , నష ముక్త్ అభియాన్ ప్రతిజ్ఞ చేయించారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్. ఈశ్వరరావు, బిజెపి జిల్లా అధ్యక్షులు ఉప్పలపాటి రాజేష్ వర్మ, మై భారత్ రిప్రెజెంట్ మణిపూరి శ్రీనివాసురావు, స్టేట్ సివిల్ సప్లయి డైరెక్టర్ గద్దె బాబూరావు, డి.ఎస్.పి రాఘవులు, ఎఎంసి చైర్మన్ డి.రామచంద్ర నాయుడు, ఆర్‌ఇసిఎస్ చైర్మన్, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, పోలీస్ సిబ్బంది, మెడికల్ సిబ్బంది, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కూటమితోనే రైతులకు భరోసా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- విజయనగరంకోట

కూటమి ప్రభుత్వంతోనే రైతులకు భరోసా అని విజయనగరం ఎమ్మెల్యే పి. అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. బుధవారం విజయనగరం మండలం గుంకలాం గ్రామంలో అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి అడ్డూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన శాసనసభ్యులు అదితి విజయలక్ష్మి ముందుగా రైతుల పంట పొలాల్లో దిగి వరి కోతను కోశారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో నియోజకవర్గంలో 4605 మంది రైతులకు రెండు కోట్ల 96 లక్షల రూపాయలు చెక్కును అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు సబ్సిడీ రుణాలతో పాటు రైతులకు అవసరమగు పనిముట్లను సబ్సిడీలు రూపంలో అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర తూర్పు కాపు చైర్మన్ పాలవలస యశస్విని మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతులను మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో ఆత్మ పీడీ వై. అనురాధ, డిఆర్‌ఎస్ ఏడి భారతి, పిఎసిఎస్ చైర్మన్ కోరాడ వెంకట్రావు, టిడిపి మండల అధ్యక్షులు గంటా పోలినాయుడు, ప్రధాన కార్యదర్శి పాశి అప్పలనాయుడు, టౌన్ పార్టీ అధ్యక్షులు గంటా రవి, ఎఎంసి చైర్మన్ కర్రోతు నర్సింగరావు, మాజీ ఎంపిపి కంది సాయి జగ్గారావు, గ్రంథాలయ మాజీ చైర్మన్ బొద్దల నర్సింగరావు, మండల పార్టీ కార్యదర్శి శివ, నాగరాజు, రాము, సత్తిబాబు, బాబాజీ పైడి నాయుడు, రైతు భరోసా కేంద్ర విఎఎ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంలో రైతులకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే అదితి

రాజాం: కూటమి ప్రభుత్వంతోనే రైతులకు భరోసా కలుగుతోందని ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో బుధవారం అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకం చెక్కును రైతులకు ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రైతుల ఖాతాల్లో రెండవ విడతలో రూ.25.71కోట్లు జమయ్యాయన్నారు. ఈ సందర్భంగా రైతులు, అగ్రికల్చర్ అధికారులు, కూటమినేతలతో కలిసి రూ.25.71కోట్ల చెక్కును ఆవిష్కరించారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రంను ఎమ్మెల్యే ప్రారంభించారు. వ్యవసాయ రంగానికి ముఖ్యమంత్రి చంద్రబాబు అధికప్రాధాన్యతను ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఏడి చంద్రరావు, రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల తహశీల్దార్‌లు, రాజాం పురపాలక సంఘం కమిషనర్, మాజీ తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ కొల్ల అప్పలనాయుడు, గురవాణ నారాయణరావు, సుమల వెంకట మన్మధరావు, పిన్నింటి మోహన రావు, లచ్చుభుక్త కృష్ణమూర్తి, దూబ ధర్మారావు, సమతం శ్రీను, మహేష్, చల్లా భుజంగరావు, దుప్పలపూడి శ్రీను, టంకాల కన్నంనాయుడు, రైతులు పాల్గొన్నారు.

సాగునీటికి ప్రాధాన్యత

బొబ్బిలిరూరల్ : రైతాంగానికి అవసరమైన సాగునీటికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని మాజీ మంత్రి, రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఆర్.వి సుజాయ్ కృష్ణరంగారావు అన్నారు. బుధవారం మెట్టవలస గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాత సుఖీభవ, పియం కిసాన్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అన్నదాత సుఖీభవ నియోజకవర్గంలో 35 వేల మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. సాంకేతిక కారణంగా ఏ రైతు కయినా లబ్ధి చేకూరక పోతే వ్యవసాయ శాఖ అధికారులు సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీను, ఎఒ యం.శ్యాంసుందర్, ఎఎంసి చైర్మన్ ఎన్.వెంకటి నాయుడు, బొబ్బిలి పిఎసిఎస్ అధ్యక్షులు శ్రీరామ్మూర్తి,

ఇనాం రైతులకు అన్నదాత సుఖీభవ ఇవ్వాలి

చీపురుపల్లి : నియోజకవర్గంలో ఇనాం భూములను సాగు చేసుకుంటూ జీవనోపాధి సాగిస్తున్న రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపచేయాలని జెసి సేదు మాధవకు స్థానిక టిడిపి నాయకులు బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఇనాం దారులకు రావలసిన రాయితీలు రావట్లేదంటూ దీని కారణంగా రైతులు నష్టపోతున్నారని జెసికి వివరించారు. ముందుగా ఈ విషయాన్ని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావుకు రైతులు చెప్పగా ఆయన వెంటనే జెసితో సంప్రదించాలని సూచించడంతో ఆర్‌ఇసిఎస్ మాజీ చైర్మన్ దన్నాన రామచంద్రుడు, శనపతి శ్రీనివాసరావు, గొర్లె లక్ష్మణ, ఇజ్జిరోతు రాంబాబు తదితరులు జెసిని కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఉన్నతాధికారులకు నివేదికను సమర్పించి సమస్యను వివరిస్తానని ఈ సందర్భంగా జెసి హామీ ఇచ్చినట్లు నాయకులు వివరించారు.

పి-4 తో పేదల అభ్యున్నతి

ప్రజాశక్తి - చీపురుపల్లి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పి-4 కార్యక్రమం ద్వారా పేదల అభ్యున్నతి సాధ్యమవుతోందని ఎంపిడిఒ ఐ.సురేష్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ ప్రాంగణంలో పి-4 కార్యాలయాన్ని ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో ఇప్పటికే 138 బంగారు కుటుంబాలను గుర్తించగా వారికి సహకారం అందించడానికి పలు కంపెనీ యాజమాన్యాలు సుమారుగా 150 ముందుకు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో పి-4 కార్యాలయ సిబ్బందితోపాటు మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పిఎసిఎస్ వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం 72వ అఖిల బారత సహకార వారోత్సవాలు బుధవారం పిఎసిఎస్ చైర్మన్ గొర్రిపాటి సింహాచలం నాయుడు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు గేదెల శ్రీను, వబ్బిన గౌరిశ్వరి, టిడిపి మండల అధ్యక్షులు డోకుల అచ్చెంనాయుడు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కోట్యాడ జగదీశ్, పార్టీ పట్టణ అధ్యక్షులు నానిగిరి రమణాజి, బిజెపి మండల అధ్యక్షులు మరిసా శ్రీను, రాష్ట్ర దాసరి సంఘం డైరెక్టర్ గనివాడ బంగారు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'చలో విజయవాడ'ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - బొబ్బిలి

విద్యుత్ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ ఈనెల 20న చేపట్టనున్న చలో విజయవాడ జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శంకరరావు, జిల్లా నాయకులు ఎస్. గోపాలం కోరారు. ఛలో విజయవాడ పోస్టర్లను బుధవారం స్థానిక 132 సబ్ స్టేషన్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన విద్యుత్ చట్టసవరణ 2025 బిల్లుతో డిస్ట్రిబ్యూషన్ కంపెనీలను ప్రైవేటీకరణ చేయాలని చూస్తుందని, ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులను విద్యుత్ సంస్థలో విలీనం చేసి తెలంగాణ తరహాలో డైరెక్ట్ పేమెంట్ ఇవ్వాలని కోరారు. విద్యుత్తు రంగంలో కేంద్రంలో మోడీ ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గాలకు వ్యతిరేకంగా కాంట్రాక్ట్ కార్మికులు, పర్మినెంట్ ఉద్యోగులు ప్రజలను ఐక్యం చేసి పెద్ద ఎత్తున పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

బాడంగి: మండలంలోని గజరాయునివలస సబ్‌స్టేషన్ వద్ద బుధవారం విద్యుత్ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ ఈనెల 20న చేపట్టనున్న చలో విజయవాడ పోస్టర్లను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శంకరరావు, జిల్లా నాయకులు ఎస్. గోపాలం విడుదల చేశారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపిక

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఈ నెల 18వ తేదీన బొబ్బిలి సంస్థాన్ హైస్కూల్‌లో జరిగిన ఎస్‌జిఎఫ్ జిల్లాస్థాయి యోగా పోటీలలో పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు గెలుపొంది రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. అండర్ 17 విభాగంలో శరణ్య, అండర్ 14 కేటగిరిలో సిహెచ్.దీపిక, కె.హర్షిత ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.శైలజా రాణి బుధవారం తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను వారికి శిక్షణ ఇచ్చిన పీడీ వరలక్ష్మి, జ్యోతిలను అభినందించారు.

రాష్ట్ర స్థాయికి బొప్పడాం విద్యార్థులు

నెల్లిమర్ల: రాష్ట్రస్థాయి పోటీలకు బొప్పడాం జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ వై.సూర్యారావు తెలిపారు. ఈ ఏడాది జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో హాకీలో అండర్ 14, 17, 19 విభాగంలో రాష్ట్ర స్థాయికి 20 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. అండర్ 14 విద్యార్థులు నెల్లూరు జిల్లా చంద్రగిరిలో, అండర్ 17 విద్యార్థులు నెల్లూరు జిల్లా విక్రమ్ సింహపూరి విశ్వవిద్యాలయంలో, అండర్ 19 విభాగం విద్యార్థులు అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. వీరిని హెచ్‌ఎం ఎం.ఈశ్వరరావు, చైర్మన్ చందక స్వామి నాయుడు, సర్పంచ్ అంబల్ల కిరణ్ కుమార్, గ్రామ పెద్దలు అభినంధించారు.

కబడ్డీ పోటీలకు బాలికలు ఎంపిక

స్థానిక జడ్‌పి బాలికొన్నత పాఠశాల విద్యార్థి యర్రంశెట్టి హారిక అండర్ 17 కబడ్డీ బాలికల విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయిందని హెచ్‌ఎం జిఎం.శారద తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు హారిక ఎంపికైందని ఈ సందర్భంగా పీడీ ఆనంద్ కిషోర్‌ను కూడా అభినందించారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు విద్యార్థి

కొత్తవలస: రాష్ట్రస్థాయి యోగా పోటీలకు వియ్యంపేట జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి జి.గంగాధర్ ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవిందరాజు మాట్లాడుతూ చదువులో భాగంగానే క్రీడల్లో కూడా రాణించాలన్నారు. ఈ సందర్భంగా గంగాధర్‌కు అభినందనలు తెలిపారు.

పిల్లల భవిష్యత్తుకు బాట వేయాలి

ప్రజాశక్తి- గంట్యాడ

మంచి ప్రవర్తనతో పిల్లలు బంగారు భవిష్యత్తుకు బాట వేయాలని డిఎంసి కోఆర్డినేటర్ సుజాత అన్నారు. మండలంలోని మహాత్మ జ్యోతి బాపూలే బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం బాలల దినోత్సవ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు జాగ్రత్తగా చదువుకొని మంచి లక్ష్యంతో మంచి ఆలోచన విధానాలను కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాలు జరగకుండా అందరూ బాధ్యత వహిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేషన్ సాయి విజయలక్ష్మి, పాఠశాల ప్రధానో పాధ్యాయులు రమణమ్మ, బుడతనాపల్లి సెక్టర్ సూపర్‌వైజర్ అనురాధ, స్టాఫ్ సెంటర్ అనిల్, పాల్గొన్నారు.

కొత్తవలస: భారతదేశ మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు బాలల దినోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా స్థానిక కెజిబివిలో బాలల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్ వైజర్లు కె.రమణమ్మ, వెంకటలక్ష్మి, సిహెచ్ నాగలక్ష్మి విద్యార్థినుల హక్కుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కెజిబివి ప్రిన్సిపల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాప్ వార్షికోత్సవం

విజయనగరం టౌన్: జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్)33వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం స్థానిక ప్రభుత్వ అంధుల పాఠశాలలో జిల్లా అధ్యక్షుడు ఎం రవిచంద్ర శేఖర్ అధ్యక్షతన ఘనంగా జరిగాయి ఈ కార్యక్రమానికి డిఇఒ యు.మాణిక్యం నాయుడు, సమాచార శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి.గోవిందరాజులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జాప్ వార్షికోత్సవ కేక్ కటింగ్ పాఠశాల విద్యార్థులతో చేశారు. కార్యక్రమంలో జాప్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అవనాపు సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు రవిచంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి అల్లాడ వెంకటరమణ, ఉపాధ్యక్షులు సూరంపూడి రమేష్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వాడాడ గౌరీశంకర్ పాల్గొన్నారు.

పూర్వ స్థితికి క్రీడా మైదానం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని విశాఖ అరకు రహదారి ప్రభుత్వ కళాశాల గ్రౌండ్‌కి ఆనుకొని ఉన్న షాపులు, రోడ్డు మార్జిన్ కాలువల ఆక్రమణ వల్ల, కాలువల పని ద్వారా వచ్చిన వ్యర్థాలతో ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం డంపింగ్ యార్డులా తయారయింది. దీంతో గత మూడు నెలలుగా ఏపుగా తుప్పలు పెరిగి పాములు కూడా చేరాయి. ఫలితంగా క్రీడల సాధనకు మైదానం పనికి రాకుండా పోయింది. మన ఊరు మన గ్రౌండ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక యువ నాయకుడు వాకాడ బాలు, మూడవ వార్డు సభ్యుడు కాపుగంటి శ్రీనివాసరావు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సుమారు యాభైవేల రూపాయలు వెచ్చించి డంపింగ్ చేసిన శిథిలాలను, డొంకలను తొలగించడమే కాకుండా మైదానాన్ని పూర్వస్థితికి తీసుకు వచ్చారు. ఇందుకోసం గత మూడురోజులుగా డ్రోజర్, జెసిబిని ఉపయోగించి లెవెల్ చేయడమే కాకుండా, శిథిలాలను బయటకు తరలించేందుకు పది ట్రాక్టర్లను ఏర్పాటు చేశారు. దాసరి కమ్యూనిటీ రాష్ట్ర డైరెక్టర్ నానిగిరి రమణాజీ, ఉపసర్పంచి మోపాడ కుమార్, మాజీ ఎంపిటిసి ఆడారి రమేష్, దొడ్డి సూర్యారావు, న్యాయవాది బొబ్బిలి రామకృష్ణ తదితరులు క్రీడా మైదానంలో జరుగుతున్న పనులను బుధవారం పరిశీలించారు. స్వచ్ఛందంగా పనిచేయిస్తున్న బాలు, వాసులను ప్రధానోపాధ్యాయుడు జగదీశ్వర రావు, బోధనా సిబ్బంది అభినందించారు.

నిర్మాణ సామగ్రి దొంగలు అరెస్ట్

ప్రజాశక్తి- సంతకవిటి

మండలంలోని వాల్తేరు సమీపంలోని బలసలరేవు వంతెన నిర్మాణానికి ఉపయోగించే సామాగ్రిని దొంగిలించిన నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం శేషాద్రిపురం కూడలిలో నిర్వహించిన తనిఖీల్లో ఎస్ఐ ఆర్.గోపాలరావు నేతృత్వంలోని పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ గోపాలరావు నిందితుల వద్ద నుంచి 20 ఐరన్ సెంటరింగ్ సీట్లు, 16 బ్యాటరీలు స్వాధీనం చేసుకున్నారు. వీరంతా మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. అరెస్టు చేసిన నలుగురిలో ముగ్గురిని రాజాం కోర్టుకు, ఒకరు బాల నేరస్తుడు కావడంతో శ్రీకాకుళం కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

బెల్టుషాపుల ద్వారా మద్యం అమ్మితే కేసులు

ప్రజాశక్తి- దత్తిరాజేరు

ప్రభుత్వ అనుమతులు లేకుండా గ్రామాల్లో బెల్ట్ షాపులు ద్వారా మద్యం అమ్మితే కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ సిఐ జనార్ధన్ హెచ్చరించారు. గతంలో బెల్ట్ షాపులు నిర్వహించి పట్టుబడ్డ పదిమందిని బుధవారం స్థానిక తహశీల్దార్ ఎదుట హాజరు పరిచి బైండోవర్ కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహించినా, వాటి కోసం వేలం పాటలు వేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు పి.నరేంద్ర, పి.శాంతలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకం తప్పనిసరి

ప్రజాశక్తి - రామభద్రపురం

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మట్ ధరించాలని ఎస్ఐ వెలమల ప్రసాద్ తెలిపారు. దీనిపై పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక పోలీసు స్టేషన్ నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఇటీవల హెల్మెట్ లేని కారణంగా ఎంతోమంది రోడ్డు ప్రమాదాలలో చనిపోతున్నారని దీంతో ఆ కుటుంబాలు నాశనం అయిపోతున్నాయని తెలిపారు. ఇప్పటికే పోలీసు శాఖ ద్వారా ఎన్నోసార్లు హెల్మెట్ వాడకంపై హెచ్చరిస్తున్నా చాలా మంది నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఈ నిర్లక్ష్యమే పెనుశాపంగా మారుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్, మండల రెవెన్యూ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణతోనే దిగుబడులు

ప్రజాశక్తి- రామభద్రపురం

మామిడి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు ఆశించవచ్చునని కృషి విజ్ఞాన కేంద్రం రస్తాకుంటుబాయి శాస్త్రవేత్త శ్రీనివాసరాజు తెలిపారు. మండల వ్యవసాయ కార్యాలయంలో బుధవారం మామిడిపంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. మామిడిలో అంతర పంటలు సాగుచేయడం ద్వారా ఆదాయాలు సమకూర్చుకోవచ్చునని తెలిపారు. హార్టికల్చర్ ఆఫీసర్ మోహనకృష్ణ మాట్లాడుతూ ఉద్యానశాఖ ద్వారా అమలవుతున్న వివిధ పథకాలను వివరించారు. ఎంఐఎఒ శ్రీలత మాట్లాడుతూ డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాల సబ్సిడీలను వివరించారు. ఆసక్తి గల రైతులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఎఎ రేవతి, హైమా, వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి మండల అధ్యక్షునిగా వర్రి రమణ

ప్రజాశక్తి - జామి

జామి టిడిపి మండల అధ్యక్షునిగా ఎట్టకేలకు వర్రి రమణను అధిష్టానం ఎంపిక చేసింది. ప్రభుత్వ పని తీరు పైన, ఎమ్మెల్యేలు, ఎమ్‌పి అభ్యర్థుల ఎంపిక కోసం వినియోగించే ఐవిఆర్‌ఎస్ సర్వేను మండల పార్టీ అధ్యక్షుల ఎంపికలోనూ వినియోగించడం విశేషం. సర్వే అనంతరం వర్రి రమణకు అధ్యక్ష పదవి అప్పగించారు. ఈ మేరకు టిడిపిలో పీట ముడి వీడింది. మండలంలో అధ్యక్ష పదవి ఎంపికపై ఎప్పటి నుంచో సర్వోపచర్చలు జరుగుతున్న విషయం తెలిసిందే. టిడిపి సీనియర్ నాయకుడిగా, పార్టీ కీలక నాయకులతో ఎంతో సత్సంబంధాలు ఉన్న లగుడు సింహాద్రి మరణం అనంతరం ఆయన కుమారుడు విద్యావంతుడు లగుడు రవికుమార్ రాజకీయాల్లోకి వచ్చారు. ఆయన మండల పార్టీ అధ్యక్ష పదవి కూడా చేశారు. కానీ డిసిసిబి చైర్మన్ గొంప కృష్ణ వర్గంతో కలిసి పని చేయడంతో స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి జామి గ్రామానికి చెందిన వర్రి రమణను పార్టీ అధ్యక్ష పదవి రేసులోకి తీసుకొచ్చినట్లు తెలిస్తోంది. ఈ నేపథ్యంలోనే గత కొంత కాలంగా అధ్యక్షులు ఎవరన్న దానిపై పోటీ నడిచింది. ఎట్టకేలకు పార్టీ అధిష్టానం వర్రి రమణకు బాధ్యతలు అప్పగించింది. వర్రి రమణ వర్గం పార్టీ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తుంది. వర్రి రమణ తన మనుషులతో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారిని బుధవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు.